## 'బడిబాట'తో 9వ వార్డు లో ఉపాధ్యాయుల సందడి




**దశ, సూర్యాపేట ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని తొమ్మిదో వార్డులో వార్డు కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న ఆధ్వర్యంలోప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ను పెంచే లక్ష్యంతో వార్డు లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పిల్లలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తల్లిదండ్రులను కలుసుకుని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పిస్తూ "బడిబాట" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న ఉచిత విద్య, పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు మెరుగైన బోధన విధానాల గురించి తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ ప్రియ కాలనీ అధ్యక్షుడు ఆత్మహత్య

**దశ, ఎల్బీనగర్:** హయత్ నగర్ లక్ష్మీ ప్రియ కాలనీలో అదే కాలనీ అధ్యక్షుడు



మధు ఆత్మహత్య చేసుకున్నాడు. ఓ చెక్ బౌన్స్ కేసులో పోలీసులు బోడ యాదగిరి అనే వ్యక్తి వేధించడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు సూసైడ్ నోట్ రాసాడు. బెయిల్ వచ్చిందని చెప్పిన నకిరేకల్ లో ఓ ఫంక్షన్ నుండి పోలీసులు తీసుకొని రావడం తో ఆత్మహత్య చేసుకున్నాడు. తన చావుకు కారణం బోడ యాదగిరి ఆయన తమ్ముడు రమణ పోలీసులే కారణమని సూసైడ్ నోట్ లో పేర్కొన్నాడు. మృతుడి బంధువులు, స్థానికులు, యాదగిరి ఇంటి ముందు మృతదేహం వేసి ఆందోళన చేసారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా యాదగిరి ఇంటికి చేరుకొని ధర్నా చేపట్టారు. మధు సూసైడ్ లెటర్ లో మరో ఇద్దరు పేర్లు కూడా రాసి ఆత్మహత్య చేసుకున్నాడు.

## పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ సహకరించాలి

❖ 46 వ వారులో పర్యటించిన మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నీవేదిత లక్షాది



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట పట్టణాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్షాది పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేట పట్టణం లోని 46వ వార్డు లో పారిశుద్ధ్య పనులను కమీషనర్ హన్మంత రెడ్డి, వైస్ చైర్పర్సన్ షఫీ ఉల్లా లతో కలసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సూర్యాపేట మున్సిపాలిటీని దేశంలోనే ఆదర్శ మున్సిపాలిటీ గా తీర్చిదిద్దేదుకు ప్రతిఒక్కరూ పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 47 వ వార్డు కౌన్సిలర్ కుమ్మరి కుంట్ల వేణు, సానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, మున్సిపల్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# హయత్ నగర్‌లో ఘనంగా మెగా వైద్య శిబిరం..



❖ 300 మందికి ఉచితంగా వైద్య సేవలు..

**దశ, హయత్ నగర్:** ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రస్తుత కాలంలో ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదని సురక్ష సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపీ శంకర్ యాదవ్ అన్నారు. హయత్ నగర్ పరిధిలోని వీరన్న గుట్ట షిర్డీ సాయి నగర్ కాలనీలో పీపుల్స్ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ వారి సహకారంతో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 300 మంది మహిళలు, వృద్ధులు మరియు కాలనీ వాసులు పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు. శిబిరంలో పాల్గొన్న వారికి ఎక్స్రే, ECG, రక్త పరీక్షలతో పాటు అన్ని రకాల సాధారణ అనారోగ్య సమస్యలు, దంత సమస్యలు మరియు కంటి సమస్యలను వైద్య నిపుణులు పరీక్షించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారందరికీ ఉచితంగా మందులు మరియు కళ్లజోళ్లను అందజేశారు. తమ కాలనీలోనే ఇంతటి భారీ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, నాణ్యమైన వైద్య సేవలు అందించడం పట్ల కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు భాస్కర్ సాగర్, కాలనీ అధ్యక్షులు డాక్టర్ నరసింహ, మాజీ అధ్యక్షులు కేకేఎల్ గౌడ్, పీపుల్స్ సర్వీస్ ప్రతినిధులు సారిక, హేమలత, స్వరూప, స్వప్న, సంతోష్, ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ కోఆర్డినేటర్ జయరాజ్, వివిధ విభాగాల వైద్యులు, నర్సింగ్ బృందం, సురక్ష సేవా సంఘం సభ్యులు పిల్లి శ్రీనివాస్ యాదవ్, ధనలక్ష్మి మరియు కాలనీ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్లీనరీని విజయవంతం చేయాలి

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** తెలంగాణ జన సమితి పార్టీ నాల్గవ రాష్ట్ర ప్లీనరీని విజయవంతం చేయాలని కోరుతూ, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గట్ల రమాశంకర్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా పార్టీ ఆఫీసులో గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి రమాశంకర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన పోరాటంలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ కోదండరాం గారి నాయకత్వాన్ని గుర్తుచేశారు. అలాగే, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారబోయిన కిరణ్ కుమార్ ముదిరాజు మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఉద్యమ ఆశయాల సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ గారి ఆశయాలతో ఏర్పడిన తెలంగాణ జన సమితి పార్టీ నాల్గవ రాష్ట్ర ప్లీనరీ మే 12న హైదరాబాద్ జలవిహార్‌లో నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ ప్లీనరీలో రాష్ట్రంలోని ప్రధాన సమస్యలపై చర్చించి, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సేల్ జిల్లా అధ్యక్షులు చంద్రకాంత్ ,పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ రైతు జనసమితి జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి చివేముల మండల పార్టీ అధ్యక్షుడు సుమన్ నాయక్ విద్యార్థి జన సమితి అధ్యక్షుడు బొమ్మగాని వినయ్ మరియు ఈశ్వర్ యువజన సమితి జిల్లా ప్రధానకార్యదర్శి నాగు నాయక్ మైనార్టీ సెల్ నాయకులు ఫరీద్ ,లోకేష్ తదితరలు పాల్గొన్నారు.



## గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని రాష్ట్ర గవర్నర్ కు విజ్ఞప్తి

**దశ, హైదరాబాద్:** గో మాతను జాతీయ ప్రాణిగా ప్రకటించి సంరక్షించాలని కాచిగూడకు చెందిన లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్ పటేల్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం బుధవారం రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాఫ్ శుక్లాను రాజ్ భవన్ లో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా లవ్ ఫర్ కౌ ఫౌండేషన్, గోవత్స ఫౌండేషన్ ల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ఫౌండేషన్ ప్రతినిధులు రిథేష్ జాగీర్దార్, తరుణ్ మెహతా, నరేష్ పరేఖ్, మురళీ మనోహర్ పాలోడ్, బద్రివిశాల్ లోయా తదితరులు గవర్నర్ కు వివరించారు. గోవత్స ఫౌండేషన్ ద్వారా గడిచిన 14 సంవత్సరాలలో 22 గోశాలలకు దాదాపు రూ.19 కోట్ల పశుగ్రాసాన్ని విరాళంగా అందించామని వారు తెలిపారు. అనంతరం లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ప్రతిమను గవర్నర్ కు అందజేసి ఘనంగా సత్కరించి అభినందించారు. గోవుల సంరక్షణ కోసం చేపడుతున్న సేవలు అభినందనీయమని గవర్నర్ శివ్ ప్రతాఫ్ శుక్లా అన్నారు.

# BRS పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం



❖ ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం
❖ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి
❖ BRS పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు

**దశ, మణుగూరు :** మణుగూరు పట్టణంలో బుధవారం BRS పార్టీ నూతన కార్యాలయాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ప్రారంభించారు. పూజా కార్యక్రమం ముగిసిన అనంతరం నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం అని అన్నారు. BRS పార్టీకి సంబంధించి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. గ్రామస్థాయిలో, పట్టణంలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని అంశాలవారీగా పోరాటాలు చేయాలన్నారు. ముఖ్యంగా మణుగూరు పట్టణంలో, రూరల్‌లో పార్టీ శ్రేణులు కష్టపడాలన్నారు.

అనంతరం మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి హరీష్‌రావుల మీద హైకోర్టులో అనుకూలంగా తీర్పు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ టపాసులు కాల్చారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ మణుగూరు టౌన్, రూరల్ అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు, కుంటా లక్ష్మణ్, పోశం నర్సింహారావు, వట్టం రాంబాబు, ముత్యంబాబు, అడపా అప్పారావు, నూకారపు రమేష్, రాంకోటి, బోశెట్టి రవి,రంజిత్, చంద్రకళ, రమాదేవి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని బుధవారం లింగోజిగూడ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఖిల మైసమ్మ ఆలయ మాజీ చైర్మన్ కందికంటి శ్రీధర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీధర్ గౌడ్ గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అడ్వకేట్ సత్యనారాయణ, బీరకాయల మధుసుధన్, అజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం మరియు స్థానిక అంశాలపై చర్చించారు. -( దశ, ఎల్ బి నగర్ )

# ఆర్టీసీ కార్మికుల సమ్మె విజయవంతం

❖ డిపోల్లో నిలిచిన ఆర్టీసీ బస్సులు
❖ ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణికులు



**దశ, ఖమ్మం జిల్లా ప్రతినిధి:** ఆర్టీసీ కార్మికులు ప్రారంభించిన సమ్మె బుధవారం విజయవంతం అయింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అన్ని ఆర్టీసీ డిపోల్లో బస్సులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. ఖమ్మం జిల్లాలో ఖమ్మం, మధిర, వైరా, సత్తుపల్లి డిపోల్లో ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు డిపోల్లో బస్సులు కూడా నిలిచిపోయాయి. ఆయా ప్రాంతాల్లో తమ సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ కార్మికులు విధులను బహిష్కరించి డిపోల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మిక నాయకులు మాట్లాడుతూ న్యాయమైన కార్మికుల డిమాండ్‌ను ఆర్టీసీ సంస్థ పరిష్కరించాలన్నారు. సమ్మె చేస్తామని కార్మికులు ముందుగానే నోటీసులు ఇచ్చినా ప్రభుత్వం స్పందించలేదని న్యాయమైన డిమాండ్లకు వెంటనే పరిష్కార మార్గం చూపాలన్నారు. అదేవిధంగా ఆర్టీసీ సంస్థను ప్రైవేటుపరం చేయకుండా కార్మికుల కుటుంబాలను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా డిపోల్లో స్థానిక కార్మిక నాయకులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట డిపో వద్ద ప్రారంభమైన ఆర్టీసీ కార్మికుల సమ్మెలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వట్టే జానయ్య యాదవ్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న కార్మికులను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం దురదృష్టకరమని అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్మికుల హక్కుల కోసం ఎప్పటికప్పుడు TRP పార్టీ ముందుండి పోరాడుతుందని హామీ ఇచ్చిన ఆయన, ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం తక్షణమే చర్చలకు ముందుకు వచ్చి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో TRP జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలు కొన్నే మంజుల గౌడ్, ఆత్మకూరు (S) మండల పార్టీ అధ్యక్షులు బొల్లె సైదులు, వల్లాల సైదులు యాదవ్, లింగాల సైదులు, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆర్టీసీ కార్మికుల సమ్మెతో తప్పని తిప్పలు

**దశ, మునగాల :** ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని మంగళవారం అర్ధరాత్రి నుండి ఆర్టీసీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె కారణంగా మండలంలోని జాతీయ రహదారి వెంట బస్సుల్లో ప్రతిరోజు ప్రయాణం చేసే ప్రయాణికులకు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. బుధవారం ఉదయం నుండి మొదటి రోజు ఆర్టీసీ సమ్మెలో భాగంగా జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సుల రద్దీ లేకపోవడంతో ప్రజలు ఆటోలను, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి తమ ప్రయాణాన్ని కొనసాగించారు. గ్రామీణ ప్రజలకు ఆర్టీసీ సమ్మెపై ముందస్తు సమాచారం లేకపోవడంతో అనేకమంది బస్సుల కోసం గంటల తరబడి రోడ్లపై నిరీక్షించి బస్సుల రాకపై చుట్టుపక్కల వారిని ఆరా తీయగా, ఆర్టీసీ సమ్మె గురించి వారు తెలియపరచడంతో అనేక మంది తమ ప్రయాణాలను రద్దు చేసుకుని తిరిగి ఇంటి దారి పట్టిన పరిస్థితులు సైతం దర్శనమిచ్చాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మెను నివారించడానికి రోడ్డురవాణా శాఖ అరకొరగా ఏర్పాటు చేసిన ప్రైవేటు బస్సులు ఒకటి రెండు రహదారుల వెంట తిరిగినప్పటికీ పూర్తిస్థాయిలో ప్రజల్ని గమ్యస్థానాలకు చేర్చే పరిస్థితి లేకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి రోడ్డుపై నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## బాల్యవివాహాలు నిరోధించి రక్షణ కల్పించండి

❖ మణుగూరు జడ్జి కంబపు సూరి రెడ్డి




**దశ, మణుగూరు:** నేడు బాలికల దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలను మణుగూరు కోర్టు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాలికలకు విద్య ,ఆరోగ్యం, హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు బార్ అసోషియేషన్ అధ్యక్షులు గురుకృష్ణ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హెల్పింగ్ హ్యాండ్స్ వితరణ



**దశ, పినపాక :** హెల్పింగ్ హాండ్స్ సహకారంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం బ్యాగులను బిటిపిఎస్ సిఈ బిచ్చన్న పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎంఈఓ నాగయ్య, సీతంపేట సర్పంచ్ శివశంకర్, బోటుగూడెం సర్పంచ్ నూప బాపనమ్మ, భూపాలపట్నం సర్పంచ్ స్వప్న, వివిధ గ్రామపంచాయతీలో ఉపసర్పంచులు, సెక్రటరీలు అశోక్, జ్యోతి, స్థానికులు నవీన్, సంపత్, బిటిపిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.




## కామ్రేడ్ లెనిన్ 156వ జయంతి వేడుకలు

**దశ, అశ్వాపురం :** రష్యా విప్లవ ప్రదాత, ప్రపంచ కార్మిక వర్గ నాయకుడు కామ్రేడ్ లెనిన్ 156వ జయంతి వేడుకలను అశ్వాపురం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ మండల కార్యదర్శి అంతనేని సురేష్, లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంతనేని సురేష్ మాట్లాడుతూ.. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా రష్యా ప్రజలను సంఘటితం చేసి, 1917 అక్టోబర్ విప్లవంతో జారు చక్రవర్తుల నిరంకుశ పాలనను కూలదోసిన మహనీయుడు లెనిన్ అని కొనియాడారు. లెనిన్ ఆదర్శాలు కేవలం రష్యాకే పరిమితం కాలేదని, భారతదేశ జాతీయ నాయకత్వంపై కూడా ఆయన ప్రభావం ఎంతో ఉందని సురేష్ గుర్తు చేశారు. భారతీయ స్వాతంత్ర్య కాంక్షకు లెనిన్ స్ఫూర్తి ఒక గొప్ప శక్తిగా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు ఈనపల్లి పవన్ సాయి, జిల్లా ఉపాధ్యక్షులు అక్కనపల్లి నాగేంద్రబాబు, సీపీఐ మండల నాయకులు నారాయణ, రామ్మూర్తి, రఘు, రాము, మహిళా నాయకులు మరియు ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరే కటిక సంఘం ఐక్యతే బలం



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** పట్టణంలోని ఆరే కటిక సంఘ సభ్యులు అందరూ ఐక్యంగా ఉండాలని కౌన్సిలర్ వెలుగు వెంకన్న పేర్కొన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో ఆరే కటిక కుల మటన్ విక్రయదారుల, మార్కెటింగ్ సేవల, పరస్పర సహాయ సహకార సంఘం, మొదటి వార్షికోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నచిన్న విభేదాలను పక్కన పెట్టి అందరూ కలిసి పనిచేస్తేనే సంఘం మరింత బలపడుతుందని తెలిపారు. సభ్యుల సమస్యలను పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని హామీ ఇచ్చారు. సహకార సంఘం అధ్యక్షుడు కోయిల్ కార్ నాగయ్య(నాగోజి) మాట్లాడుతూ సంఘానికి స్వంత భవనం లేకపోవడం వల్ల సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జమాల్ పూరి బాలిశ్వర్ జి, కార్యదర్శి సింకార్ చంద్రం జి, సంయుక్త కార్యదర్శి జమాల్ పూరి నరేష్ జీ, కోశాధికారి టింగిల్ కార్ శ్రీనివాస్ రావు జీ, గౌరవ అధ్యక్షులు కంమ్లెకార్ సంజయ్ జీ, టింగిలుకార్ నారాయన్ జీ, టింగిలుకార్ శ్రీనివాస్ జీ, జమల్ పూరి శంకర్ జీ, నరేందర్ జీ, నర్సింగ్ రావు జీ, సతీష్ జీ, భానుచందర్ జీ, వినోద్ కుమార్ జీ, జమాల్ పూరి సాయి జీ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల సొంతింటి కల సాకారం

❖ గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

❖ లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపిన పాయం



**దశ, అశ్వాపురం:**, పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామంలో లబ్ధిదారు మీడియం లక్ష్మి నివాసంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియం లక్ష్మి దంపతులకు నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న ఆయన, ఈ కొత్త ఇంట్లో వారు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని, ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి: మంత్రి తుమ్మల



❖ చర్చికాంపౌండ్ ఓవర్ బ్రిడ్జిని

❖ కలెక్టర్ తో కలిసి పరిశీలించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**దశ, ఖమ్మం :** ఖమ్మం నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు సౌకర్యవంతమైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం నగరంలోని చర్చికాంపౌండ్, ప్రకాష్ నగర్ ఓవర్ బ్రిడ్జ్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జ్ల ప్రస్తుత పరిస్థితి, మరమ్మత్తుల అవసరం, ట్రాఫిక్ సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. చర్చికాంపౌండ్ ఓవర్ బ్రిడ్జ్ పై ప్రయాణించే వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బ్రిడ్జ్ మధ్యభాగంలో రబ్బరు స్ట్రిప్స్ ఏర్పాటు చేసి వాహనాల ప్రయాణాన్ని సాఫీగా మార్చాలని సూచించారు. అలాగే, బ్రిడ్జ్ పై ఉన్న గుంతలు, పగుళ్లు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని, బ్రిడ్జ్ మీద ఉన్న పూల కుండలలో మొక్కలు సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. అవసరమైన చోట్ల హెచ్చరిక బోర్డులు, ప్రమాదాల సూచనలు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను నివారించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని పనులు నాణ్యతతో, సమయపాలనతో పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారులలో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు పోషణ్ పక్వాడా

**దశ, సూర్యాపేట ప్రతినిధి:** చిన్నారులలో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు CDPO సుబ్బలక్ష్మి అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని జమ్మిగడ్డ సెక్టార్ HBC గోపాలపురం అంగన్వాడి సెంటర్ నందుసూర్యాపేట ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాల ప్రయోజనాలు, వినియోగంపై అవగాహన కల్పించారు. వీటితో పాటు చిన్నారులకు కథలు, మెదడు పని తీరు, చిన్నతనంలోనే విద్యాభ్యాసం వంటి కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతీ రోజు తీసుకునే ఆహారం స్థానంలో పోషకాలు మెండుగా ఉండే చిరుధాన్యాలు తీసుకోవడం వలన విటమిన్లు, ప్రోటీన్లు, ఖనిజ లవణాలు లభిస్తాయన్నారు. దీంతో రక్తవృద్ధి ఎదుగుదల, రోగనిరోధక శక్తి పెరుగడంతోపాటు జీవక్రియ మెరుగు పర్చడంతో శరీరం సమర్థవంతగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ మన్సూర్ బి, ఫారూఖ్, అంగన్ వాడి టీచర్స్ సూపర్వైజర్ వీరమ్మ విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.